క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

దహెగాం: మండలంలోని ఇత్యాల గ్రామానికి చెందిన గుర్లే వెంకటికి చెందిన ఇల్లు పాక్షికంగా శుక్రవారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ఇంటిలో దేవుని పటం వద్ద దీపం వెలిగించి కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంటిలో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు, బట్టలు, రూ. 20వేల నగదు మంటల్లో కాలిపోయాయన్నారు. వ్యవసాయ పనుల కోసం దాచుకున్న డబ్బు కాలిపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా పంచాయతీ కార్యదర్శి సాయి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

‘బాధిత మహిళకు న్యాయం చేయాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలంలో దాడికి గురైన ఆదివాసీ మహిళకు ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాజలింగు అన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తరచుగా హిందు మహిళలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు రమేశ్, సంతోష్, వేణుగోపాల్, రామగిరి సతీశ్ ఉన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామంలో శుక్రవారం గుడుంబా తయారు కేంద్రాలపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. గుడుంబా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 1200 లీటర బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాధవ్ గౌడ్ మాట్లాడుతూ గుడుంబా తయారీ, అమ్మకం చట్టరీత్యా నేరమని, అమ్మినా, తయారు చేసినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కల్తీ మద్యం, నాటుసారా విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా గుడుంబా తయారు చేసినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణ, కానిస్టేబుళ్లు ధరవత్ శంకర్, ప్రభాకర్, కవిత, తుకారం తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు యూ– డైస్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు గావుడే హన్మంతు, జయరాజ్, హెచ్‌ఎంలు నానాజీ, నారాయణ్‌సింగ్, పెద్దులు, ఆర్పీలు శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కౌటాల: మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా ఎంఎల్ రాజు, ప్రధాన కార్యదర్శిగా చునార్కర్ గణపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా లూర్థయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా శైలజ, కార్యదర్శిగా జాటోత్ సంతోషలను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏటుకూరి శ్రీనివాసరావు, రవిశంకర్, రవికుమార్, జయరాజ్, నారాయణ్‌సింగ్, రమేశ్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో వృద్ధులు, మహిళలకు సేవలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు డిజిటల్ బోధనలో భాగంగా 10 కంప్యూటర్లతో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయులు దేవాజీ, శ్రీనివాస్‌రావు, వరలక్ష్మి, నాగరాణి, రవికుమార్, స్వామి, సత్యనారాయణ, వనిత, ఉమేశ్, ఖుర్షీద్, ఆస్మీ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె), ఖురుకుంగూడ, రాజులగూడ గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆసుపత్రి సరే.. వైద్యులేరి..?

- సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- వైద్యులు, స్టాఫ్‌నర్సులు లేక రోగుల తిప్పలు
- పీహెచ్‌సీలో మందుల కొరత
- ప్రైవేట్‌కు పరుగులు పెడుతున్న వైనం


లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


మందులు లేక ఖాళీగా ఉన్న సెల్ఫ్‌బాక్స్‌లు


వైద్యాధికారి లేక ఖాళీగా కుర్చీ


ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు కుర్చీ

లింగాపూర్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రోగులు అనేక అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీకి రోజూ 70 నుంచి 80 మందికి పైగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ఓపీ పేషెంట్లు వస్తున్నారు. కానీ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలు అందడం లేదు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వైద్యుడు సేవలందించగా బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లాడు. అప్పటి నుంచి వైద్యుడు లేక రెండో ఏఎన్‌ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులతోనే సేవలందిస్తున్నారు. మండలంలో ఒక రెగ్యులర్ వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ప్రధాన ఏఎన్‌ఎంలు, ఒక అటెండర్‌లు ఉండాల్సి ఉన్నా కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. కాగా పీహెచ్‌సీ పరిధిలో మూడు హెల్త్ సబ్‌సెంటర్లు ఉన్నాయి. వాటిలో మొదటి ఏఎన్‌ఎం లేకపోవడంతో రెండో ఏఎన్‌ఎంలు చికిత్స అందిస్తున్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా 30వేలకు పైగా జనాభా ఉంది. మూడు సబ్ సెంటర్లలో 20కి పైగా హ్యాబిటేషన్ గ్రామాలు ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆసుపత్రిలో రెండో ఏఎన్‌ఎంలు రోగులను చూసి ఉన్న మందులతో సరిపెడుతున్నారు. రోగుల పరిస్థితి ఏమాత్రం క్లిష్టంగా ఉన్న పట్టణ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. దంపూర్ గ్రామ పంచాయతీలోని కీమానాయక్‌తండా, పూల్‌సింగ్‌తండా గ్రామస్తులు డెంగీ, వైరల్ జ్వరాలతో మంచాలకే పరిమితమయ్యారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. ప్రభుత్వ దవాఖానాలో వైద్యుడు, ఇంజక్షన్‌లు ఇచ్చే స్టాఫ్‌నర్సులు, మందులు లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

రవాణా కష్టాలు..

ఏదైనా అత్యవసర చికిత్స కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాలంటే రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 30 వేలకు పైగా జనాభా ఉన్నా కనీస సౌకర్యాలు కల్పించలేదని మండలవాసులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను చికిత్స నిమిత్తం ఉట్నూర్, జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలంటే 30 కిలోమీటర్ల దూరం ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు వెచ్చించి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మండలంలో వెంటనే 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి..



లింగాపూర్ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. డాక్టర్ లేక రెండో ఏఎన్‌ఎంలు వైద్యం చేస్తున్నారు. వైద్యుడు లేకపోవడంతో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో జైనూర్‌కు వెళ్తున్నాం.

– జాటోత్ దవీత్‌కుమార్, లింగాపూర్

12 గంటలపాటు సేవలు అందించాలి



లింగాపూర్ పీహెచ్‌సీ వైద్య సేవలు 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచాలి. సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న గిరిజన గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా లింగాపూర్ ఆసుపత్రిలోనే సిబ్బందిని నియమించాలి

– జాదవ్ నాను, మోతీపటార్

జైనూర్‌లో పోలీసుల బందోబస్తు


షాపులోని సామగ్రి తరలిస్తున్న దుకాణదారుడు

జైనూర్: ఇటీవల మండలంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలతో పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు కిరాణ సరుకులు, కూరగాయలు కొనాలంటే నానా అవస్థలు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో సొంత వాహనాలు లేని వారు ఎంతదూరమైనా నడవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో దుకాణాలు నిర్వహించే వారు కాలిపోగా మిగిలిన సామగ్రిని వాహనాలలో తమ సొంత గ్రామాలకు తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ అధికారులు కాలిపోయిన దుకాణాలలో సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌లో విధులు నిర్వహించే షాప్ కీపర్‌లు, హమాలీలు, పండ్లు, కూరగాయల వ్యాపారస్తులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు సంయమనం పాటించి, పోలీసులకు సహకారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో శుక్రవారం సాయంత్రం ఆదివాసీ టీచర్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. దేశానికి మంచి పౌరులను అందించడం కేవలం ఉపాధ్యాయులకు సాధ్యమని తెలిపారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గావుడే హన్మంతు, గోడం నానాజీ, ఇందురావ్, ఎడ్ల తిరుపతి, మడావి పోచాని, ధర్మయ్య, అశోక్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సార్లు సెలవుల్లో.. పిల్లలు ఆటల్లో


తాళం వేసి ఉన్న కోపగూడ పాఠశాల ఎదుట ఆడుకుంటున్న విద్యార్థులు

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులు సెలవులు పెడుతున్నారు. ఫలితంగా ఏకోపాధ్యాయ పాఠశాలలకు తాళం వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మండలంలోని ఖమాన పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ‘సాక్షి’ శుక్రవారం సందర్శించింది. కోపగూడ, సర్కేపల్లి పాఠశాలలకు తాళం వేసి ఉంది. విద్యార్థులు ఆటలు ఆడుకుంటూ కనిపించారు. దీనిపై ఖిరిడి కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రబోధ్‌ను వివరణ కోరగా కోపగూడ, సర్కేపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు ఇద్దరూ లీవ్‌లో ఉన్నట్లు తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ఏకోపాధ్యాయ(సింగిల్ టీచర్) పాఠశాల ఉపాధ్యాయుడు సెలవు పెడితే విద్యార్థులు నష్టపోకుండా కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలి. ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యాబోధన కొనసాగించాలి. కనీసం సీఆర్పీలు అయినా బడి తెరిచి పిల్లలకు మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ చేపట్టాలి. అలాగే కొందరు టీచర్లు సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఉదయం పది గంటలైనా బడి తెరుచుకోకపోవడంతో పిల్లలు తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

క్రీడలతో మానసికోల్లాసం

నస్పూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీజీఎం(పర్సనల్) అరవిందరావు అన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో నిర్వహిస్తున్న వార్షిక క్రీడల్లో భాగంగా అథ్లెటిక్స్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్థానిక పోరుకు కసరత్తు

- మండలంలో పూర్తయిన ఓటర్ల జాబితా సవరణ
- వార్డులవారీగా ఓటర్ల జాబితా ప్రచురణకు అంతా సిద్ధం
- కుటుంబమంతా ఒకే వార్డులో ఉండేలా సవరణలు


ఆన్‌లైన్‌లో ఓటర్లను నమోదు చేస్తున్న అధికారులు

రెబ్బెన: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గత ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచుల పదవీ కాలం ముగియగా జూన్‌లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం సైతం పూర్తయింది. అయితే ప్రభుత్వం వెంటనే స్థానిక ఎన్నికలను నిర్వహించకుండా పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారుల పాలనలోనే ప్రస్తుతం గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే జనవరిలోపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల నిర్వహించే సమయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తుగానే చర్యలు చేపట్టింది. అసెంబ్లీ పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఓటర్లను గ్రామ పంచాయతీలవారీగా క్రోడీకరించటంతో పాటు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

పూర్తయిన ఆన్‌లైన్ ప్రక్రియ..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా వాటి పరిధిలో 214 వార్డులు ఉన్నాయి. గత జనవరి 1, 2024 నాటికి మండలంలో మొత్తం 28,332 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల వరకు పంచాయతీల్లోని ఓటర్లు వివిధ వార్డుల వారీగా ఉండేవారు. ఎన్నికలు జరిగిన ప్రతీసారి కుటుంబంలోని ఓటర్లు తమ తమ వార్డులకు కేటాయించిన వివిధ పోలింగ్ స్టేషన్‌లకు వెళ్లి తమ ఓటుహక్కు వినియోగించుకునేవారు. దాంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యేవారు. అయితే ఈసారి ప్రభుత్వం ఓటర్ల జాబితాను సవరించే పనిలో పడింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్‌స్టేషన్ వారీగా ఉన్న ఓటర్లను వార్డుల వారీగా క్రోడీకరించే పనిలో అధికారులు పడ్డారు. ఒక గ్రామ పంచాయతీలోని ఓటర్లు పక్క గ్రామ పంచాయతీలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటుహక్కును వినియోగించుకునేవారు. దాంతో కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే వార్డులో ఓటుహక్కు వినియోగించుకునేలా జాబితా సవరించారు. దాని కోసం కుటుంబంలోని సభ్యులందరు ఒకే వార్డులో ఉండేలా చర్యలు చేపట్టారు. రాత్రింబవళ్లు శ్రమించి పంచాయతీ కార్యదర్శులు ఓటర్ల జాబితాను సరిచేశారు. సరిచేసిన ఓటర్ల ఆన్‌లైన్ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. సవరించిన ఓటర్ల జాబితాను శుక్రవారం గ్రామ పంచాయతీలో వార్డులవారీగా ప్రచురించాల్సి ఉండగా ప్రభుత్వం ఈనెల 13 వరకు అవకాశం కల్పించింది.

తొలగనున్న ఇబ్బందులు..

గతంలో ఒక కుటుంబంలోని ఓటర్లు ఒకే వార్డులో కాకుండా వివిధ వార్డుల్లో ఉండడంతో ఓటర్లతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సైతం ఇబ్బందులకు గురయ్యేవారు. తాజాగా కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఉండేలా జాబితా సరిచేయటంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఓటర్ల జాబితాను నమోదు చేశారు. దాని కోసం పంచాయతీ కార్యదర్శులు రాత్రింబవళ్లు శ్రమించి ఓటర్ల జాబితాను కొలిక్కితీసుకొచ్చారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సైతం పూర్తి కాగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా జాబితాను ప్రచురించేందుకు పంచాయతీ కార్యదర్శులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేయటంతో ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ ప్రస్తుతం ఆగిపోయింది.

ఆన్‌లైన్ పూర్తి చేశాం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేశాం. గతంలో ఒక కుటుంబంలోని ఓటర్లు ఒక్కో వార్డులో ఉండేవారు. కానీ ఈసారి కుటుంబంలోని సభ్యులంతా ఒకే వార్డులో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సవరించి ఆన్‌లైన్ ప్రక్రియ సైతం పూర్తి చేశాం. సవరించిన ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురిస్తాం. జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తాం.

– వాసుదేవ్, సూపరింటెండెంట్, రెబ్బెన

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

నార్నూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్‌బంక్ వద్ద గుట్టపై నుంచి రోడ్డుపైకి వస్తున్న వర్షపు నీటిని పరిశీలించారు. నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీవో స్వప్నశీలను ఆదేశించారు. జీసీసీ డీఎంకు పైపులైన్ కోసం లేఖ రాయాలని సూచించారు. గ్రామ పంచాయతీ వర్కర్ల ద్వారా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి మోతిరాం, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

‘గణేశ్’ పూజలకు వేళాయె..!

- పెరిగిన విగ్రహాల ధరలు
- మట్టి విగ్రహాలే మేలంటున్న పర్యావరణ ప్రేమికులు
- జోరుగా మండపాల ఏర్పాటు
- నేడు వినాయక చవితి


కౌటాలలో ముస్తాబవుతున్న మండపం


కౌటాలలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు

కౌటాల: హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ఒకటి. తొమ్మిది రోజుల పాటు వినాయకుడిని భక్తితో పూజించి, చివరకు గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేస్తారు. దీంతో ఊరువాడ సందడి వాతావరణం నెలకొంటుంది. నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే భక్తులు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మండపాలు సిద్ధం చేశారు. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాల్లో కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు.

మట్టి విగ్రహాలే మేలు..

భక్తులు మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో నీటి సాంద్రత పెరిగి ఆక్సిజన్ తగ్గి చేపలు, కప్ప వంటి జలచరాలు మృతి చెందుతున్నాయి. మట్టి విగ్రహాల వల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని, నిమజ్జనం చేసిన కొద్ది గంటల్లోనే పూర్తిగా కరిగిపోతుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

విగ్రహాల ధరలు పైపైకి..

వినాయక విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. పీఓపీ విగ్రహ తయారీ ముడిసరుకు, కెమికల్, రంగుల ధరలు భారీగా పెరగడంతో తయారీదారులు ప్రతిమల ధరలను సైతం భారీగా పెంచి విక్రయిస్తున్నారు. దీంతో ఉత్సవ కమిటీల సభ్యులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఆరు ఫీట్ల ఎత్తు విగ్రహానికి రూ.15వేల నుంచి రూ. 20 వేల వరకు ధర ఉండగా., 10 ఫీట్ల ఎత్తు వినాయక విగ్రహానికి రూ. 30వేల నుంచి రూ. 40 వేల వరకు ధరలున్నాయి. 12 –15 ఫీట్ల విగ్రహాలకు రూ. 70 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. విగ్రహాల ఆకారం, మోడళ్లను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంది. ఇక గణపయ్యకు నైవేద్యం పెట్టే అరటి పండ్లతో పాటు పూలు, పత్రి ధరలు సైతం రెట్టింపయ్యాయి.

నేటి నుంచి నవరాత్రులు

వినాయక చవితి వేడుకలకు మండపాలు ముస్తాబవుతున్నాయి. విద్యుత్ వెలుగులు, ప్రత్యేక అలంకరణలతో నిర్వాహకులు ఏర్పాట్లు జోరుగా చేస్తున్నారు. మండపాల్లో శనివారం గణనాథుడు కొలువుదీరనున్నాడు. నేటి నుంచి నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు అందుకోనున్నాడు. మండపాల వద్ద తొమ్మిది రోజుల పాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. కాగా జిల్లాలో ఇంటర్‌నెట్ నిషేధం యువతను నిరాశకు గురిచేస్తోంది. ఉత్సవాల ఏర్పాట్లకు నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఫోన్ పే, గుగూల్ పే వంటి సేవలు నిలిచిపోవడంతో వినాయక విగ్రహాలు, పూజ సామగ్రికి నగదు చెల్లింపులకు తిప్పలు పడుతున్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

మట్టి విగ్రహాల వల్ల ఎలాంటి కాలుష్యం ఉండదు. నిమజ్జనం చేసిన కొద్ది గంటల్లోనే పూర్తిగా కరిగిపోతుంది. దీంతో పర్యావరణ కాలుష్యానికి ఆస్కారం ఉండదు. వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పద్ధతులను పక్కన బెట్టి, పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యమివ్వాలి. ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేయాలి.

– వినోద్‌గౌడ్, యోగా శిక్షకులు

ప్రకృతి ఆరాధనకే ప్రాధాన్యత

భారతీయ సంస్కృతిలో ప్రకృతి ఆరాధనకు అధిక ప్రాధాన్యముంది. పండుగల వెనుకున్న లక్ష్యం కూడా అదే. ప్రకృతి హితమే పండుగల పరమార్థం. పండుగలు జరుపుకోవడం ద్వారా సాంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించగలం. మన భక్తి వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడం మంచిది కాదు. మా ఇంట్లో మట్టి గణపతినే పూజిస్తాం. ప్రభుత్వం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాలి.

– చంద్రకళ, భక్తురాలు

పంటలు పరిశీలించిన ఫైనాన్స్ కమిషన్ చైర్మన్


పంటలు పరిశీలిస్తున్న రాజయ్య

సిర్పూర్(టి): జిల్లాతోపాటు మహారాష్ట్రలో కురుస్తున్న కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీటమునిగిన పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో పంటలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పరిశీలించారు. మండలంలోని టోంకిని గ్రామ సమీపంలో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పంటల పొలాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆయన వెంట కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో మధులత ఉన్నారు.